క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీ మెగా టౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్ నగర్, లక్ష్మి గార్డెన్, కుర్మగూడ, వైఎస్ఆర్ కాలనీ, యంజాల్ గ్రామంలో సరఫరాను నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సినర్జీ హోమ్స్, ద్వారకా నగర్, శోభానగర్, సిలికాన్ సిటీ, ఆపిల్ సిటీ, ఏవీనగర్, వింటేజ్ హోమ్స్, యాదాద్రి హోమ్స్‌లో సరఫరా ఉండదన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సాగర్‌రోడ్డును విస్తరించండి

యాచారం: ప్రమాదాలకు నిలయంగా మారిన నాగార్జునసాగర్- హైదరాబాద్ రహదారిని విస్తరించాలని బీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డుపై నిత్యం ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా ఎదో ఒక చోట ప్రమాదాలు జరిగి, ప్రయాణికులు గాయపడుతున్నారని తెలిపారు. మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డును నాలుగు లైన్లుగా చేస్తే.. ప్రమాదాలను అరికట్టవచ్చునని వివరించారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే


దర్గాలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు: జహంగీర్‌పీర్ దర్గాను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలి వినతి


ఏడీఏకి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శి

ఇబ్రహీంపట్నం: ముకునూర్ గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో నీటి సమస్య ఉందని, దాని పరిష్కారానికి త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వాలని ఆ గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్.. ఇబ్రహీంపట్నం డివిజనల్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ సీతారాములుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో నీటి ఎద్దడి నివారణకు కొత్తగా వేసిన బోర్ నీటిని వినియోగించుకునేందుకు అక్కడ అమర్చిన మోటార్‌కు త్రీ ఫేజ్ సరఫరా చేయాలని విన్నవించారు. అందుకు ఏడీఏ సానుకూలంగా స్పందించారని కార్యదర్శి తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: భారత్ నిర్వహిస్తున్న సిందూర్ ఆపరేషన్‌లో భాగస్వాములవుతున్న సైనికులు క్షేమంగా ఉండాలని ఎల్లమ్మ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం అన్నారు. పురపాలిక సంఘం పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పాకిస్తాన్‌తో జరుగుతున్న యద్ధంలో మన సైనికులు విజయం సాధించి, క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఓ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

11నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

కందుకూరు: ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు టి.లక్ష్మణ్‌ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న ఆదివారం మహాగణపతి, విశ్వక్సేన పూజ, హోమాలు, 12న స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం, 13న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 14న బోనాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

ఎండైనా.. వానైనా..

బస్ స్టేజీలు, బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిలువనీడలేక.. వేళకు రాని బస్సులకోసం ఎండైనా వానైనా రోడ్లపైనే నిరీక్షిస్తున్నారు. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్యాసింజర్లు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


కర్కల్‌పహాడ్‌లో బస్సు కోసం ఎండలోనే వేచిచూస్తున్న ప్రయాణికులు

రోడ్లపైనే నిరీక్షణ

- బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి, కర్కల్‌పహాడ్ గ్రామాల్లో గతంలో బస్సు షెల్టర్లు ఉండేవి. రహదారి విస్తరణలో వాటిని తొలగించారు. మక్తమాధారం, రావిచేడ్ వంపుగూడ, న్యామతాపూర్, చల్లంపల్లి, రేఖ్యతండా తదితర గ్రామాల్లో బస్ షెల్టర్లు నిర్మించలేదు. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు ఎండలోనే నిరీక్షిస్తున్నారు.

శిథిలావస్థలో..

స్థానిక ప్రజలతో పాటు, చుట్టు పక్కల గ్రామాలు, తండాల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం మండల కేంద్రం కడ్తాల్‌తో పాటు, ఆమనగల్లు, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. స్టేజీల వద్ద బస్ షెల్టర్లు లేకపోవడంతో కాలం ఏదైనా రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. వానాకాలంలో వర్షం కురిస్తే రహదారిపై నిలువ నీడ లేక రోడ్డు పక్కన దుకాణాలు, నివాసాల వద్ద నిలబడుతున్నారు. మరి కొన్ని గ్రామాల్లో షెల్టర్లు ఉన్నప్పటికీ గ్రామ పంచాయితీ సిబ్బంది పట్టించుకోక పోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. కొత్తగా బస్టాప్‌లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా సమస్యకు పరిష్కారం దొరకడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో స్టేజీల వద్ద బస్ స్టాప్‌లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి



గ్రామంలో గతంలో బస్సు షెల్టర్ ఉండేది. ఏడేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో దానిని తొలగించారు. నాటి నుంచి ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పైనే నిలబడుతున్నారు. ఇదే విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించాము. అయినా పట్టించుకోవడం లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి, బస్ షెల్టర్ నిర్మించాలి.

– యాదయ్య, కర్కల్‌పహాడ్

అమర జవాన్లకు ఘన నివాళి

- భారీగా ర్యాలీలు

కడ్తాల్: పాకిస్తాన్ కవ్వింపు చర్యలు మానుకోవాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హితవు పలికారు. లేని పక్షంలో అదను చూసి భారత్ కోలుకోని తీస్తుందని హెచ్చరించారు. తద్వారా దాయాది దేశం ప్రపంచ పటంలో లేకుండా పోతుందని పేర్కొన్నారు. మండల పరిధి మైసిగండి గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కేతావత్ హీరాసింగ్ ఆధ్వర్యంలో, భారత్- పాక్ యుద్ధంలో అసువులు బాసిన జవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌ల చిత్రపటాలకు శుక్రవారం నివాళులర్పించారు. సైన్యానికి మద్దతుగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ.. భారత్‌పై తరచూ దాడులకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాకిస్తాన్ ఇలాగే వ్యవహరిస్తే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతిగౌడ్, నాయకులు జవహర్‌లాల్, స్టాలిన్ కిషన్, తులసీరాం, బోసిశంకర్, కిషన్, నర్సింహగౌడ్, జగన్, ప్రవీణ్, సీతారాం, బాబూలాల్, ఆంజనేయులు, దేవానాయక్, హర్యానాయక్, మల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


మైసిగండి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆలయంలో పూజలు

పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధించాలని మైసిగండి మైసమ్మ ఆలయంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పూజలు చేశారు. ఇందులో ఆలయ అర్చక సిబ్బంది యాదగిరిస్వామి, చంద్రయ్య, రాములు, కృష్ణగౌడ్, శ్రీనివాస్, విజయ్‌గౌడ్, బాలబ్రహ్మచారి, శ్రవణ్, భాను ప్రకాశ్ శర్మ, సంతోష్, ఆనంద్, వెంకటరమణ పాల్గొన్నారు.


కడ్తాల్: ర్యాలీలో పాల్గొన్న నాయకులు

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు


ఆమనగల్లు: మార్కెట్‌యార్డులో ధాన్యం పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- రైతులు.. కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి
- కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: రైతులు తమ పంటలను దళారులకు విక్రయించి మోసపోవద్దని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధరతో సన్నాలకు బోనస్ పొందాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్‌యార్డు ఆవరణలో చైర్‌పర్సన్ యాట గీత ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, అంజయ్య గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు ధనుంజయ, కృష్ణ, పర్వతాలు, వెంకట్‌రెడ్డి, ఖాదర్, శ్రీధర్‌రెడ్డి, కండె సాయి, మహేశ్, శ్రీనునాయక్, గౌస్, విజేందర్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాడ్గుల: ధాన్యం పరిశీలిస్తున్న జగన్ గౌడ్

సన్నాలకు బోనస్

మాడ్గుల: రైతులు.. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సింగిల్ విండో డైరెక్టర్ కొప్పు జగన్ గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. తేమ, మట్టి గడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రమేష్ గౌడ్, సిబ్బంది చంద్రయ్య, శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్మీకి మద్దతుగా ర్యాలీ

బడంగ్‌పేట్: పాకిస్తాన్‌పై యుద్ధం నేపథ్యంలో ఆర్మీ జవాన్లకు మద్దతుగా శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ బడంగ్‌పేట్‌లోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మహేశ్వరం, కందుకూరు మండలాలు, సరూర్‌నగర్, ఆర్‌కే పురం డివిజన్లు, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మునిసిపాలిటీల నుంచి పార్టీలకు అతీతంగా హాజరుకావాలని కోరారు.

పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: పాడి రైతులు ఆర్థికాభివృద్ధి చెందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య అధికారి దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి నదీమ్‌నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. వేసవిలో పశువులను జాగ్రత్తగా కాపాడుకుంటే ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. వేసవిలో పాల ఉత్పత్తి తగ్గుతుందని, మూగ జీవాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో అధికంగా నీటిని అందించాలని, మధ్యాహ్నం వాటిని నీడలో ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్ రవి, రైతులు, పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

- ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ వినతి
- పాఠశాల విద్యా కమిషనర్‌ను కలిసిన సభ్యులు


పాఠశాల విద్యా కమిషనర్ నరసింహారెడ్డిని కలిసిన ఆకునూరి మురళి, ఎస్ఎంసీ సభ్యులు

మంచాల: ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎస్ఎంసీ సభ్యులు కోరారు. ఈ మేరకు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో కలిసి శుక్రవారం పాఠశాల విద్యా కమిషనర్ నరసింహారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆరుట్ల స్కూల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఇప్పటికే రూ.60 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. స్కూల్‌కు మరో ఆరు గదులు అవసరమని తెలిపారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, ఎస్‌డీఎఫ్ సభ్యురాలు పద్మజషా, ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కంభాలపల్లి భాస్కర్, నూకం రాజుముదిరాజ్, ఎం.డీ. జానీపాష, లాలగారి జంగయ్య, నూకం మల్లేశ్, చిందం శ్రీశైలం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య


మంచాల: ఆరుట్లలో.. బడిబాటలో ఉపాధ్యాయులు తదితరులు


మంచాలలో..

- బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి
- పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరమేష్
- బడిబాట ప్రారంభం

ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు వర్కాల పరమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల వివరాలు సేకరించి, వారిని సర్కారు బడులకు రప్పించే విధంగా కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల సహకారంతో ముందుకు వెళ్లనున్నామని చెప్పారు. ఇందులో భాగంగా కరపత్రాల రూపంలో డోర్‌టు డోర్ క్యాంపెయిన్ చేయనున్నామని వెల్లడించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో ఫెయిల్ అయిన వారికి పీఆర్‌టీయూ తరఫున స్టడీ మెటీరియల్ అందించామని తెలిపారు. ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, బాషయ్య, అంగన్‌వాడీ టీచర్ బేబీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నంలో..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, మీ పిల్లలను సర్కారు బడికి పంపించాలని ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయుడు సురేష్.. పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలు, జంగాల బస్తీలో ఇంటింటికీ వెళ్లారు. బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, చక్కటి విద్యాబోధన, ఫలితాల తీరును వివరించారు. అర్హత గల ఉపాధ్యాయులతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో చిన్నారులకు పాఠాలు చెబుతున్నామని, ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వివరించారు.

ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆమనగల్లు ఎంఈఓ పాండు అన్నారు. బడిబాటలో భాగంగా శుక్రవారం ఆయన పట్టణంలోని శ్రీకాంత్ కాలనీ, ఉదయనగర్ కాలనీ, నవచైతన్య కాలనీలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించారు. అనంతరం వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. నాణ్యమైన విద్యతో పాటు అదనంగా ఇంగ్లిష్ మీడియంలో బోధన, ఏఐ డిజిటల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సీఆర్‌పీలు షేక్ అహ్మద్, కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక భారం వద్దు..

తుర్కయంజాల్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కొహెడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి బాయి అన్నారు. బడిబాటలో భాగంగా కొహెడలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సర్కారు బడుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు బడుల్లో తమ పిల్లలను చేర్పించి ఆర్థిక భారం మోయవద్దని సూచించారు. ప్రభుత్వ బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అనుభవం ఎక్కువగా ఉంటుందని, చిన్నారులకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నామని వెల్లడించారు.


ఆదిబట్ల: బడిబాటలో ఉపాధ్యాయులు


తుర్కయంజాల్: కొహెడలో..


ఆమనగల్లు: చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

భక్తిభావం పెంపొందించుకోవాలి

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రమేష్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారు రమేష్ అన్నారు. చైత్ర మాసం శుక్రవారం పురస్కరించుకొని సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్‌లు పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనసు ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంసాని శ్రీనివాస్, రాంమోహన్, పోల శశిధర్, తాటి నారాయణమూర్తి, సాగర్, కోటిలింగం, అశోక్, శ్రీనివాస్, విజయలక్ష్మి, రఘునాథ్ అనిత, కల్వ మురళీ, అర్చకులు మోహన్‌రావు పాల్గొన్నారు.

పనిచేసేవారికే ప్రాధాన్యత

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికే అన్ని పదవులు వస్తున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. ఇతర పార్టీల వారికి ఇందిరమ్మ కమిటీలు తదితర పదవులు దక్కుతున్నాయని పార్టీ శ్రేణులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అధికార పార్టీ కార్యకర్తలకే అవకాశం లభించిందని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా ఇతరులకు పదవులు దక్కినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని పేర్కొన్నారు. చేవెళ్ల ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీలతో పాటు ఇతర పదవుల్లోనూ పార్టీలో పనిచేసేవారికే ఎమ్మెల్యే కాలె యాదయ్య అవకాశం కల్పిస్తున్నారని స్పష్టంచేశారు. కొందరు కావాలని సొంత పార్టీ వారే లేనిపోని ఆరోపణలు చేస్తూ, గందరగోళం సృష్టించడానికి కారణమవుతున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని, తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386